
# అమెరి'కులాసా' కథలు

– వంగూరి చిట్టెన్ రాజు





## -27-

## 'అసమాన అనసూయ" గారే లేక పోతే?

మూడంకె వేశాను.

ఊహూ..

ఆరంకె వేశాను.

లాభం లేదు.

హాయిగా గుండెల మీద రెండు చేతులూ వేసుకున్నాను.

అబ్బే..పని జరగ లేదు.

ఇక లాభం లేదు అని అమెరికా పద్ధతి ప్రకారం మేకలు లెక్క పెట్టాను. వెయ్యి మేకలు దాటినా ఏమీ తేడా లేదు. అంత కంటే ఎక్కువ లెక్కలు లెక్క పెట్టడం మా లెక్కల మేష్టారు నేర్పించ లేదు. ఏమో..ఆయనకీ అంత కంటా ఎక్కువ రావేమో!

అరగంట ఏకాగ్రంగా గాయత్రి పఠించినా పరిస్తితిలో మార్పు లేదు.

బ్రహ్మాస్త్రం కదా తెలుగు పుస్తకం చదవడం మొదలెట్టి పాతిక పేజీలు దాటినా రాత్రి రెండు దాటిపోయినా నిరాశే మిగిలింది. ఆ ఆధునిక కథ కూడా మనకి అక్షరం ముక్క అర్ధం అవలేదు.

ఇక రూటు మార్చాలి అని సొంత మెత్తటి పరుపు మీద నుంచి లేచి ముందు గదిలో తోలు సోఫా మీద నడుం వాల్చాను. అయినా నిద్ర పట్ట లేదు సరి కదా, సోఫా అంచు లోంచి జారి నేల మీద ధమ్మని పడ్డాను. అది తివాసీ కాబట్టి సరిపోయింది. అమెరికా గొప్ప వాళ్ళ ఇంట్లో లా నిగ నిగ లాడే చెక్క ముక్క మీద పడి ఉంటే నడుం పట్టేసేది.

అదే నాకూ, క్వీన్ విక్టోరియాకీ ఉన్న తేడా. ఇలా పక్క మీద నడుం వాల్చగానే రక రకాల రాగాలలో పాడుకుంటూ హాయిగా నిద్ర పోయే జాతకం ఆవిడది. దాన్ని గుర్రు అని నేను ముద్దుగా పిలుచుకున్నా ఆవిడ ఛస్తే ఆ మాట ఒప్పుకోదు సరి కదా నీకు కర్నాటక సంగీతం అంటే ఎలా ఉంటుందో తెలిసి ఛస్తే గా అంటుంది. సాక్షాత్తూ లతా మంగేష్కరే వచ్చి నాకు "నిదుర పోరా తమ్ముడా" అని జోల పాడినా, కళ్ళకి నల్ల గంతలు కట్టుకుని చుట్టూ కారు చీకటిని సృష్టించుకున్నా, ఎన్ని రకాల ట్రిక్కులూ, మేజిక్కులూ వాడినా కంటికి కునుకు రాని జాతకం మనది. అసలు మా పెళ్లప్పుడు మా ఇద్దరి జాతకాలూ గొప్పగా పడ్డాయి ప్లీడరు గారూ అని మా నాన్న గారికి చెప్పిన ఆ జ్యోతిష్కుడు ఇవాళ కనపడితేనా....ఏం చేస్తానో నాకే తెలీదు. అసలు ఆయన బతికే ఉన్నాడో లేదో కూడా తెలీదు.

ఒక సారి నా నిద్ర గోడు ఓ బోడి స్నేహితుడితో చెప్పగానే "పోనీ మందూ, మాకూ ఏమైనా పటాయించు" అని కన్ను గీటాడు ఆ రాస్కెల్. పిచ్చి కుదిరింది తలకి రోకలి చుట్టమన్నాడు ఇలాంటి వాడే! కానీ వాడు 'మందు' అనగానే లటుక్కున నా బుర్రలో చిరు దీపం వెలిగి


మా ఇంటి దగ్గరే ఉన్న మందుల కొట్టుకి వెళ్లి పలు రకాల నిద్ర మాత్రలు కొని తెచ్చుకున్నాను. అంటే...గొప్ప కంపెనీ వారి మాత్రలు పాతిక డాలర్లు, సరిగ్గా అవే మాత్రలు జెనెరిక్ ..అనగా ఇండియాలో జలంధర్ తయ్యార్ బాపతువి పది డాలర్లు, భారత ఆయుర్వేదం తాలూకు అయితే పది హేను డాలర్లు, అమెరికా ప్రకృతి, అనగా నేచర్ బ్రాండ్ అయితే నలభై డాలర్లు..ఇక ఈ అన్నింటికీ రెట్టింపు ఖరీదు నా ఆల్ టైమ్ ఫేవరేట్....ఆర్గానిక్ నిద్ర మాత్రలు.... ఇవన్నీ అనమాట. ఆ మందుల కొట్లో వీటి పక్కనే తల నొప్పి, తిండి అరుగుదలా మరియు విరోచనములకి కూడా ఇన్ని రకాల ద్రావకాలూ, గుళికెలూ చూసి అమెరికా గొప్పతనాన్ని మరొక సారి మెచ్చుకున్నాను.

ఇక అలా తెచ్చుకున్న మాత్రలు రోజుకి ఒక రకం వేసుకున్న కారణంగా జరిగిన గడబిడ అంతా ఇంతా కాదు. ఉదాహరణకి మొన్న అన్నం తింటూ చారులో మొహం దాచుకుని గంట సేపు దాకా లేవ లేదు. అది కడుక్కోవడానికి స్నానాల గదిలో సబ్బు రాసుకుంటూ శుభ్రంగా మరో మూడు గంటలు నిద్ర పోయాను. కూరలు కొనుక్కోడానికి మార్కెట్ కి వెళ్దాం అని కారు స్టార్ట్ చేసి వెనకాలే ఉన్న మా క్వీన్ విక్టోరియా కారుని గుద్దేసి అక్కడే గుర్రు పెట్టి నిద్రపోయాను. దాంతో ఆవిడకి పూనకం వచ్చి ఆ నిద్ర మాత్రలతో పాటు నా గుండె, షుగర్,...అసలు గుండ్రంగా గానీ, మరే ఆకారంలో కానీ, ఏ రంగులో కానీ ఉన్న సకల గుళికెలనీ నిర్దాక్షిణ్యంగా గార్బేజ్ లోకి విసిరేసింది. మొత్తం ఆర్ధిక నష్టం వెయ్యి డాలర్ల పైనే. అంతే కాదు. మా డాక్టర్ ని పిలిచి "మా ఆయన నిద్ర సంగతి అమీ తుమీ తెలుస్తావా లేక ఆయన్ని చెట్టుకి కట్టేయనా?" అని అడిగింది. ఆవిడ ఆసంకల్పితంగా "బయట చెట్టు బదులు ఇంట్లో స్తంభం బెటరేమో" అనేసి నాలిక్కరిచేసుకుని, నాకు ఒక వారం రోజులు వాళ్ళ ఆఫీసులోనే పడుకునే ఏర్పాటు చేసింది. దానికి మొదటి కారణం నన్ను క్వీన్ విక్టోరియా బారి నుంచి కాపాడడం అయితే, అసలు కారణం నాకు "స్లీప్ ఎప్నియా" అనే కొత్త రకం రోగం ఏమన్నా ఉందేమో అని పరీక్ష చెయ్యడం. అనగా..నాకు నిద్ర పట్టకుండా ఉండే ప్రత్యేక రోగం ఏమన్నా ఉందా అనే పరీక్షట. చెప్పొద్దూ. నాకు భలే మండింది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా అసలు నిద్ర పట్టకే కదా ఈ కథ అంతా జరుగుత. ఆ మాత్రం దానికి నేను ఆవిడ ఆఫీసులో పడుకుంటే అక్కడా నిద్ర పట్టదు కదా. అంత కంటే ఏం తెలుస్తుంది. కానీ మన సొంత పరుపు మీద, తోలు సోఫా మీద పట్టని నిద్ర డాక్టర్ ఆఫీసులో ఎలా పడుతుంది? నేను అదే ప్రశ్న మా డాక్టరమ్మని అడగగానే ఆవిడ సమాధానం విని భయం వేసింది.

"అదేం కాదు రాజు గారూ. మీకు ప్లాస్టిక్ చెడ్డీ వేస్తాం. పడుకోడానికి కడుపు నిండా పెరుగూ, అన్నం పెడతాం. మీ నెత్తి మీద అవసరం అయితే అక్కడక్కడ అరంగుళం గుండు గీస్తాం...మీకు చిన్నప్పుడు ఒడుగు చేసినప్పుడు పంచ శిఖలు పెట్టారు జ్ఞాపకం ఉందా..అలా అన మాట. అలా ఓ పది చోట్ల కరెంట్ తీగలు జిగురుతో అతికిస్తాం. వాటిని మా యంత్రం తో అను సంధానం చేస్తాం..అంటే చంద్రబాబు గారు గోదావరిని కృష్ణా నదితో అనుసంధానం చేసినట్టు అనమాట. అప్పుడు మీ లోపల మెదడులో నిద్ర తాలూకు కరెంట్ ప్రవాహాలు అన్నీ రికార్డు అయిపోతాయి. వాటిని చూస్తే మాకు మీకు నిద్ర పట్టుట, పట్టక పోవుట మరియు మీ మెదడుకు సంబంధించిన ఇతర రకాల రోగ నిర్ధారణ చెయ్య గలుగుతాం". ఇదీ మా డాక్టరమ్మ ఇంకా ఆవేశంగా చెప్తున్న దాంట్లో నన్ను బాగా ఆకర్షించిన మరియు కలవరపెట్టిన విషయం ఆ ఆఖరి అంశం..అనగా "నా మెదడు లో ఇతర రకాల రోగ నిర్ధారణ" అనే మాట. అనగా ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టు మనం నిద్ర సమస్య కి వెళ్తే వీడికి వేపకాయంత వెర్రో, పిచ్చో ఉంది అని నిర్ధారణ చేసే అవకాశం కొనితెచ్చుకోవడం అనమాట. పైగా నాకు ఆ ప్లాస్టిక్ చెడ్డీలంటే భలే చిరాకు. అంచేత మళ్ళీ పంచ శిఖలు పెట్టుకునే అవకాశాన్ని పక్కన పెట్టి ఇంటికి వచ్చేశాను.

ఇంటికి రాగానే...క్వీన్ విక్టోరియా గారి ఉవాచ: అసలు నాకు తెలియక అడుగుతానూ....నీకు నిద్ర పట్టకపోతే ఏం కొంప మునిగిందీ? హాయిగా తెలుగు టీవీ చూసుకో..."

"తెలుగు టీవీ యా"– హడిలి పోయాను. ఎందుకంటే ఎప్పుడు ఎవరు ఎక్కడ ఎవరు హత్యకి గురి అయ్యో, కారు ప్రమాదంలో మరణించో మరే విధంగానో దారుణ మరణం వారి శరీరాలు పదే, పదే పది హేను రోజులు చూపించే దౌర్భాగ్య సంస్కృతి మన తెలుగు టీవీ వారిది.



"పోనీ పాత సినిమాలు చూసుకో. ఏవైనా పాటలు విను"

పాటలు అనగానే నాకు మా అనసూయ గారే జ్ఞాపకం వస్తారు. వచ్చారు. ఇక కలకాలం జ్ఞాపకాలలోనే ఉంటారు. అంతే. రాత్రి హాయిగా నిద్ర పోడానికి, నిద్ర పట్టకపోతే హాయిగా ఆనందం అనుభవించడానికీ, మన పల్లెలలో పచ్చటి పొలాలలో "నో మీన మల్లాల" అని పాడుకోడానికీ, "మొక్క జొన్న తోటలో" విహరించడానికీ, "రామనాసందనాలో" అని ఎలుగెత్తి పాడడానికీ, "అన్నాడె వస్తనన్నాడె" అని ప్రియుడి మీద బెంగ పెట్టుకోడానికీ, "నక్కలోళ్ళ సినదాన్ని" గా వగలు పోడానికీ, "ఎద్దు బండి మీద గడ్డిలో కూచుని బండి పాట" పాడుకోడానికీ, "తర్లీ వచ్చే పెళ్లి కుమారిత పల్లకి" లో పులకించిపోడానికీ, ""జయ జయ జయ ప్రియ భారత" అనీ, "హే భారత జననీ" అని దేశభక్తితో పాడడానికి.....

అన్నీ స్వచ్ఛమైన తెలుగు పాటలే. సొంత నేల మీద బంక మట్టిలో పుట్టిన మాణిక్యాలు. వాటిని కనిపెట్టిందీ, పెంచి పోషించిందీ, కష్టపడి కాపాడిందీ, పదిమందికీ పంచి ఇచ్చిందీ, నిలబెట్టిందీ అన్నీ అనసూయమ్మ గారే. అలనాటి నుంచి ఈ నాటి దాకా తెలుగు నాట సినిమాలలో కానీ, ఎటువంటి సంగీత కార్యక్రమాలలో నైనా జానపద బాణీ వినపడితే అది అనసూయమ్మ గారి పాద ధూళి నుంచి జాలువారినదే. "ఏరువాకా సాగారో" విన్నా, "మనసున మల్లెల మాలలుగినా", "కాటమరాయుడా" ...లాగ గొంతు ఎవరిదైనా వినపడేది అనసూయమ్మ గారి బాణీయే..ఆవిడ స్వరమే.... కేవలం ఆవిడ గళం, స్వయంగా అలవోక గా వాయించే హార్మోనియం, డప్పు ..అంతే....కర్షకులూ, కార్మికులు పాడుకుంటూ సేద దీరే ఆ సంగీతం వింటూ ఉంటే నాకు నిద్ర రాక పోతే నష్టం ఏముంది? అందుకే ఇక నిద్ర మీద బెంగ తీరిపోయింది. దానికి విరుగుడు మంత్రం దొరికిపోయింది....

"అసమాన అనసూయ" గారే లేక పోతే....అది ఊహకందని భావం. మన పల్లెలు, పదాలు ఉన్నంత కాలం, ఆ తర్వాతా కూడా ఆవిడ పాట అజరామరంగానే ఉంటుంది.

(మార్చ్23, 2019 నాడు పరమపదించిన "కళా ప్రపూర్ణ" డా. అవసరాల (వింజమూరి) అనసూయా దేవి గారి దివ్య స్మృతికి అంకిత భావం తో)

**COMMENTS**